ప్రజాశక్తి

సోమవారం 5 ఆగస్టు 2024

5



రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి -అనంతగిరి: ఉపాధి హామీ పథకం కింద రైతులకు జీడీ. మామిడి మొక్కలు పంపిణీ చేస్తున్నామని ఏపిఎం ఎస్ కె.నాయుడు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో భీంపోలు పంచాయతీ గరుగుబిల్లి, గుమ్మ కోట, కాశీపట్నం, కొత్తూరు, చిలకలగెడ్డ, రొంపల్లి, ఎన్ ఆర్ పురం, లొంగపర్తిలో 68 మంది రైతులకు జీడి మామిడి మొక్కలు పంపిణీ చేశామన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎపిఎం



ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భవనాల కొరత

-ల్యాబ్‌ల్లోనే తరగతుల నిర్వహణ
-ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజన ప్రాంతంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు సరిపడే తరగతి గదులు, వసతి గదులు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో గిరి విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరిపడే తరగతి భవనాలు లేక విద్యా బోధనకు కళాశాల అధ్యాపక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదులు సరి పోక పోవడంతో ఒకే గదిలో ఎక్కువ మందిని కూర్చోబెడుతూ విద్యా బోధన సాగించడంతో విద్యార్థులకు సైతం ఇబ్బందులు పడక తప్పడం లేదు. సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్థానిక కళాశాలలో పర్యటించి పర్యవేక్షణ చేయకపోవడంతో ఇక్కడి సమస్యలు పరిష్కారం కాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో సుమారు 446 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ హెచ్ఇసి, సిఇసి, బైపిసి, ఎంపీసీ గ్రూపులు ఉన్నాయి. ప్రథమ సంవత్సరంలో 240 మంది, ద్వితీయ సంవత్సరంలో 206 మంది విద్యార్థులు విద్య ను అభ్యసిస్తున్నారు. తరగతి గదులతో పాటు ల్యాబ్, ఆఫీస్ రూమ్, లైబ్రరీ రూమ్‌తో కలిపి సుమారు 7గదులు మాత్రమే ఉన్నాయి. ల్యాబ్‌ల్లోనే తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. అందులోనే అన్ని గ్రూపులకు సంబంధించి 446 మంది విద్యార్థులకు విద్యాబోధనను కొనసాగిస్తున్నారు. ప్రత్యేకంగా ఎంపీసీ, బైపీసీ చదివే విద్యార్థులకు ప్రాక్టికల్స్ కోసం ప్రత్యేక లాబ్ సౌకర్యం ఉండాల్సినప్పటికీ భవన సౌకర్యం ప్రాక్టికల్స్ కు సంబంధిత గ్రూప్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సరిపడే భవన సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక్కడి కళాశాలలో చదివే విద్యార్థులకు ప్రత్యేక వసతి హాస్టల్ సౌకర్యం ఉన్నప్పటికీ సరిపడే తరగతి భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు అంటున్నారు.

అదనపు భవనాలు నిర్మించాలి:

విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రస్తుతం అదనంగా 5 అదనపు గదులు తోపాటు ఎన్ఎస్ఎస్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రరీ, ప్రిన్సిపల్ గది, లేడీస్ వెయిటింగ్ గదులను కల్పించాల్సి ఉంది. వీటితోపాటు తాగునీటి సౌకర్యం, ప్రహరీ, కేజీబీవీ నుంచి రోడ్డు సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఈ సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి కళాశాలలో విద్యార్థులకు సరిపడే అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

పరాయి పంచన ప్రభుత్వ పాఠశాల

భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రైవేటు భవనంలో నిర్వహణ

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని తాటివాడ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ పాఠశాలను గత్యంతరం ఓ ప్రైవేటు రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. తాటివాడ ఎంపీపీ పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు 11 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని వర్షాకాలంలో స్లాబ్ పై నుండి నీరు కారుతుంది. దీంతో విద్యార్థులతో పాటు వారి పుస్తకాలు తడిచిపోతున్నాయి. తరగతి గదిలో కూర్చుని చదువుకునే వీల్లేకుండా ఉంది. అంతేకాక స్లాబ్ పెచ్చులు కూడా ఊడి పడుతున్నాయి. ఎప్పుడు పెచ్చులూడి మీద పడతాయోనని లోపల కూర్చేనేందుకు విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు స్పందించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది తమ పిల్లలను పాఠశాలకు పంపించడానికి ఆసక్తి కనబర్చ లేదు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సత్యవతి రంపచోడవరం ఎంఈఓ మల్లేశ్వరరావుకు తెలియజేయడంతో ఆయన పాఠశాలను సందర్శించిన గ్రామస్తులతో మాట్లాడి పాఠశాలను తాత్కాలికంగా ఓ ప్రైవేట్ రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. పాఠశాల భవనం మరమ్మతు చేయించాలని గ్రామస్తులు ఇటీవల రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవికి వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.



అసంపూర్తి రేకుల షెడ్డులో పాఠశాలను నిర్వహిస్తున్న దృశ్యం

పాఠశాల హెచ్ఎం వివరణ



దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సత్యవతిని వివరణ కోరగా... గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద ఎంపిక కాలేదు. భవనం శిథిలావస్థలో ఉందని ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో పాఠశాల భవన మరమ్మతులకు గతేడాది రూ.26వేలు మంజూరు చేశారు. కాని రూ.13 వేలు మాత్రమే విడుదల చేయడంతో ఆ నిధులు సరిపోవని వాటిని ఖాతా నుండి తీయలేదు. దీంతో 2023 మార్చి నెలలో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయని ఆమె తెలిపారు.

ఎంఇఒ వివరణ



మండల విద్యాశాఖాధికారి మల్లేశ్వరరావును వివరణ కోరగా... పాఠశాల శిథిలావస్థ విషయంపై విద్యాశాఖ కమిషనర్‌కు, సీఎం పేషీకి, రంప చోడవరం ఐటీడీఏ పీవోకు, స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవికి రిపోర్టు పంపించాం. మండలంలో భవనాలు లేని పాఠశాలలు 7, భవనాలు శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలు 5 ఉన్నాయి. వాటిని కూడా మరమ్మతులు చేయడానికి నిధులు కేటాయించాలని కోరుతూ ఉన్నతాధికారులకు లేఖను పంపించినట్లు ఎంఇఒ తెలిపారు.

ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9న ఘనంగా నిర్వహించాని, గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ముద్రించిన కరపత్రాలను ఆదివారం స్థానిక సిహెచ్ స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు ఎస్ సూరిబాబు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం నాడు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తూ ప్రకటన చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. అడవులపై ఆదివాసీలకు ఉన్న హక్కులను తొలగించి ప్రైవేటు బడా కార్పొరేటర్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీలకు విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ నెల 9న జరగనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి అన్ని ప్రజా సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాంగి గంగరాజు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నేతలు, విద్యార్థులు



అంధకారంలో ఉన్న అరకులోయ పట్టణం

అంధకారంలో అరకులోయ

-వెలగని వీధి లైట్లు.- రాత్రివేళలో రోడ్డుపై పశువుల సంచారం
-అవస్థలు పడుతున్న వాహనదారులు -పట్టించుకోని అధికారులు-

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ పట్టణంలో వీధిలైట్లు వెలగక పోవడంతో స్థానికులు అంధకారంలో మగ్గుతున్నారు. పంచాయితీ పాలకులు, అధికారులు పట్టించుకోక పోవడంతో అరకులోయ పట్టణంలోని వీధి దీపాలు వెలగక రోజురోజుకు అమావాస్య చీకట్ల తలపిస్తుందని స్థానిక గిరిజనులు ఆరోపించారు.

అరకులోయ పట్టణం పర్యాటక కేంద్రం కావడంతో దేశ నలుమూలల నుంచి వచ్చే పర్యాటకుల వీధి లైట్లు వెలగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధి లైట్లు వెలగక పోవడంతో వాహనాలు చోరీకి గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పశువులు అడ్డంగా ఉంటుండడంతో వాహన చోదకులు నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ప్రధాన రహదారిపై ఉన్న వీధి లైట్లు వెలగక పోవడంతో రోడ్డుపై పశువులు తిరుగుతుండంతో ప్రమాదాలు చోటు చేసుకుం టున్నాయి.

ఎన్టీఆర్ గ్రౌండ్ నుండి గ్రీన్ వేల్లి జంక్షన్ వరకు ఉన్న లైట్లు పడైపోయి వెలగ లేదు. దీనిపై పంచాయతి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి లైట్ల మరమ్మతు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రాత్రి వేళలో రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

వరద బాధితుల ఆర్థిక సాయం పంపిణీ



వరద సాయం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి గ్రామంలోని వరద బాధితులకు స్థానిక సర్పంచ్ పూనం సరోజిని, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ చేతుల మీదుగా ఆదివారం ఆర్థిక సహాయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద బాధితులు రేఖపల్లి పునరవాస కేంద్రాలకు వచ్చి, కొంతమంది తమ బంధువులు వద్ద ఉండటంతో రేకపల్లి గ్రామ ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, దానిని గుర్తించిన సర్పంచ్ వారికి కూడా వరద ఆర్థిక సహాయం అందించాలని రేషన్ కార్డు ఉన్నవారికి, కొత్తగా పెళ్లై రేషన్ కార్డు లేనివారికి ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ తరుణ్, మహిళా పోలీస్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు..

బియ్యం అందజేత...

రేఖపల్లి గ్రామ ప్రజలకు స్థానిక సర్పంచ్ పూనం సరోజిని సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, టిడిపి మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు చేతుల మీదుగా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పంకు బాబు, సూరిబాబు, టిడిపి నాయకులు మల్లికార్జునరావు, పాల్గొన్నారు.

పశ దాణా అందజేత

మండలంలోని రేఖపల్లి గ్రామంలో 20 రోజుల పాటు వరదలకు పశువులు తిండిలేక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వెటర్నరీ అధికారులతో మాట్లాడి పశువులకు దాణా తెప్పించినట్లు సర్పంచ్ పూనం సరోజిని అన్నారు. ఈ మేరకు ఆదివారం వెలుగు ఆఫీస్ వద్ద సర్పంచ్ సరోజిని, సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ చేతుల మీదుగా పశువుల యజమానులకు దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, పశువుల యజమానులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో డిఎవి విద్యార్థికి రెండు స్వర్ణాలు

ప్రజాశక్తి -సీలేరు

విజయవాడలో ఇటీవల జరిగిన క్లస్టర్ రన్నింగ్ రేస్ పోటీల్లో 100 మీటర్లు, 200 మీటర్లు విభాగాల్లో జికె.వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాల పదో తరగతి విద్యార్థి అమీర్ బాషా ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. క్లస్టర్ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓం నమశివాయ ఆదివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీర్ బాషా ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి పాఠశాలకు వన్నె తెచ్చారని కొనియాడారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో క్లస్టర్ స్థాయి పరుగుపందెం పోటీలకు పంపడానికి పాఠశాల ఎల్ఎంసి చైర్మన్ నిరాకరించారని, అయితే అమీర్ బాషా తండ్రి రంజాన్ ఒత్తిడి మేరకు పంపించామని చెప్పారు. తండ్రి రంజాన్ కృషి, అమీర్ బాసా పట్టుదల దృఢ సంకల్పంతో రెండు బంగారు పతకాలు సొంతం చేసుకోవడం సాధ్యమైందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో అమీర్ బాషా రాణించేందుకు పిఈటితో తర్ఫీదు ఇచ్చేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. అమీర్ బాషాను డిఎవి పాఠశాల ఎల్ఎంసి చైర్మన్, ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, పిఈటి కమలాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.



బంగారు పతకాల కైవసం చేసుకున్న అమీర్ బాషా (1వ నెంబర్ వద్ద నిలబడిన విద్యార్థి)

సోమిరెడ్డిపాలెం వీధి రహదారి బురదమయం

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి లోని భద్రచలం రోడ్ వెళ్లే రోడ్డు నుండి సోమిరెడ్డి పాలెం వీధికి వెళ్లే మట్టి రహదారి బురదమయంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలతో ఈ మార్గం బురదబురదగా తయారై దిగబడిపోతుంది. దీంతో ఆ గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో సిసి రోడ్లు లేకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించింది. సీసీ రోడ్ వెయ్యాలని ఎన్నోసార్లు నాయకులకు, అధికారులకు విన్న వించుకున్నా ఫలితం లేదని, నాయకుల మాటలు నీటి మూటలుగా మిగలయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నూతన ఎమ్మెల్యే చొరవ తీసుకొని సిసి రోడ్డు మంజూరు చేసి నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బురదమయమై అధ్వానంగా ఉన్న సోమిరెడ్డి పాలెం వీధి రోడ్డు

గెడ్డలపై వంతెనలు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి -డుబ్లిగుడ: మండలంలోని శీలంగొంది రోడ్డు చంపపట్టి గెడ్డ, పెదపాడ రోడ్డు చాపరాయి జలపాతం గెడ్డ వద్ద వంతెనలు నిర్మించాలని స్థానిక సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, శీలంగొంది రోడ్డు, చంపపట్టి గెడ్డ వద్ద నిర్మించిన కాజ్వే గత 2014లో కురిసిన హుదూద్ తుఫానుకు కొట్టుకుపోయిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వంతెన నిర్మించక పోవడంతో ఆ ప్రాంత గిరిజనులు రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత పంచాయతీ ఎన్నికల ముందు ఓట్ల కోసం అప్పటి స్థానిక ఎమ్మెల్యే హడా విడిగా వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు శంకుస్థాపన చేసి మూడేళ్లు పైబడుతున్నా ఇప్పటివరకు నిర్మించకుండా గిరిజనులను మోసం చేశారని విమర్శించారు. పెదపాడు కొంత గిరిజనులకు రవాణా సౌకర్యానికి చాపరాయి జలపాతం గేడ్డ వద్ద వంతెన నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నప్పటికీ ఇప్పటికీ అక్కడ కూడా నిర్మించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని తెలిపారు. తక్షణమే ఉన్నత స్థాయి అధికారులు స్పందించి వంతెన సౌకర్యం నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆ ప్రాంత గిరిజనులతో కలిసి ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పశు సంరక్షణ కేంద్రాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు : మండల పశువుల పెంపకదారుల నుంచి పశు సంరక్షణ కేంద్రాల నిర్మాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల పశు వైద్య శాఖ అధికారిని ఎం.సౌజన్య దేవి ఆదివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు ప్రకారం. రెండు పశువులు కలిగిన వారు షెడ్డు ని నిర్మించుకునేందుకు ప్రభుత్వం యూనిట్ విలువ రూ.1,15,000 మంజూరు చేస్తుంది. వీటిలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కింద రూ.1,03,500 90 శాతం మంజూరు చేస్తుంది. నాలుగు పశువులు కలిగిన లబ్ధిదారుడికి షెడ్ విలువ రూ. 185000, ఆరు పశువులు కలిగిన లబ్ధిదారుడికి రూ.2,30,000 మంజూరు చేస్తూ 10 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు.20 గొర్రెలు, మేకలు కలిగిన యజమానికి యూనిట్ ఖర్చు 1,30,000, 50 గొర్రెలు మేకలు కలిగిన యజమానికి 2,30,000, 100 కోడ్లు, క్షీరదాలు కలిగిన యజమానికి యూనిట్ ఖర్చు రూ.87000 మంజూరు చేస్తుంది. 200 క్షీరాదాలు కోళ్ల పెంపకంలో ఉన్న రైతులకు రూ.1,32,000 మంజూరు చేస్తూ వాటికి 30శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన లబ్ధిదారులు గోకులం అప్లికేషన్, పాస్పోర్ట్ సైజు ఫోటో, స్థలం ఫోటో, ఇన్పుట్ డేటా సైట్ భూమి పట్టాదారి పాస్ పుస్తకం లేదా 1 బి, మీసేవ అడంగల్, జాబ్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు , రేషన్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్ , కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ జిరాక్స్, ఇంటి పన్ను, డాక్యుమెంట్, గ్రామసభ తీర్మానంతో మండల పశువైద్యశాల లో సమర్పించాలన్నారు.

ట్రిపుల్ ఐటీకి నేహాసిని ఎంపిక

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో వెంకటాపురం గ్రామానికి చెందిన తమరాన నేహాసిని ట్రిపుల్ ఐటీ కి ఎంపిక కావడంతో విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గడిచిన విద్యా సంవత్సరంలో వెంకటాపురం జిల్లా పరిషత్తు పాఠశాలలో 10వ తరగతిలో 567 మార్కులు సాధించిన ఈ అమ్మాయి ఒంగోలు ట్రిపుల్ ఐటీ కి అర్హత సాధించింది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లావుద్దీన్ మరియు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎపిఇఎంజెఎ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఏపీయూడబ్ల్యూజే అనుబంధ సంస్థ ఏపిఈఎంజేఏ నర్సీపట్నం సర్వసభ్య సమావేశంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పెంటకోట జోగినాయుడు, రా నాయకులు సిహెచ్‌బిఎల్ స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చింతల కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నర్సీపట్నం ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా విజయ్, కార్యదర్శిగా శ్రీనివాస్ వర్మ, ఉపాధ్యక్షుడిగా ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా అప్పలనాయుడు, జాయింట్ సెక్రెటరీగా నాతవరం మండలానికి చెందిన వనిమిన శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఈశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు.

మూడు శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రెల్లి కులానికి మూడు శాతం రిజర్వేషన్ కల్పించాలని నర్సీపట్నం రెల్లి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అబీద్ సెంటర్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గతంలో ఇచ్చినట్లు కాకుండా.. కొంత మార్పు రావాలని ఆశిస్తామన్నారు. ఈ విభజనలో గతంలో రెల్లి, ఉపకులాలకు చాలా అన్యాయం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి భగీరధ, చెన్నా శ్రీనివాసరావు , మజ్జి దినేష్ పాల్గొన్నారు.

రోడ్డంతా బురదమయం



బురదమయంగా ఉన్న పూతికపట్టు రహదారి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని గత పది రోజులుగా కురిసిన తుపాను కారణంగా రోడ్లంతా వరద దాటికి కోతకు గురై రాకపోకలకు అంతరాయం నెలకొంది. దీంతో ఆ రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు బురదలో కూరుకుపోయిన పరిస్థితి నెలకొంటుంది.

మండలానికి మారుమూల పినకోట, పెద్దకోట, కివర్ల పంచాయతీలకు ఆనుకొని ఉన్న బొర్రా పాలేం, సటకంభ, బోనురు, చీడిమెటు, గడ్డి బంధ, పూతికపుటు, జగడలమామిడి, టెంకలబంద గ్రామలకు రింగ్ రోడ్డు నిర్మించేందుకు 2021.-22 సంవత్సరంలో కోట్లాది రూపాయల నిధులు

రాకపోకలకు అవస్థలు

మంజూరయ్యాయి.కాంట్రాక్టర్ నత్తనడకన పనులు చేపడుతుండటంతో కురుస్తున్న వర్షాలకు రోడ్లంతా కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. దీంతో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బీటలు వారిన జడగలమామిడి రోడ్డు

'సిట్'పై దాగుడు మూతలేనా?

భూ ఆక్రమణలపై రెండు నివేదికలూ బుట్టదాఖలేనా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ అంటేనే ప్రభుత్వ భూముల దురాక్రమణ'దారు'లకు అడ్డా.. అన్న నానుడి స్థిరపడిపోయింది. బయట ప్రాంతాల నుంచి విశాఖకు బతుకు తెరువు కోసం వచ్చిన కొంతమంది పెద్దలు ఇక్కడ తీరప్రాంతం, గ్రామీణం, గిరిజన ప్రాంతాలన్నింటా సెటిల్ అయి, ప్రభుత్వ భూములను కాజేయడం 1970-80వ దశకం నుంచీ మొదలైంది. రూ.వందల కోట్ల విలువైన వేల ఎకరాలు పెద్దల ఆక్రమణలో మూలుగుతున్నాయి. విశాఖ నగరంలోనూ విలువైన భూములను ఇలాగే తమ గుప్పెట పెట్టుకుని ప్రభుత్వాల కళ్లు కప్పుతూ కళ్లముందే తిరుగుతున్నారు. 1990వ దశకం తర్వాత వీరిలో కొంతమంది రాజకీయాల్లో క్రియాశీలకంగా మారడంతో తమ భూముల బాగోతం ఇంకా వర్ధిల్లుతోంది. టిడిపి హయాంలో వైసిపి, వైసిపి హయాంలో టిడిపి సిట్ నివేదికలపై కంఠశోష పెట్టడం తప్ప ఏ ప్రభుత్వానికీ ఈ నివేదికలు బయటపెట్టి దోషులపై చర్యలు తీసుకున్న దాఖలా లేదు. జిల్లాలో వామపక్షాలు ప్రధానంగా సిపిఎం ఈ సిట్ నివేదికలను ప్రభుత్వం బయటపెట్టి దురాక్రమణదారులు ఎంతటి వారైనా కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలంటూ తొలినుంచీ డిమాండ్ చేస్తోంది.

అందుగలడు ఇందులేడని సందేహం వలదన్నట్టుగా...

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రముఖ రాజకీయ ప్రధాన పార్టీల (వైసిపి, టిడిపి)కు చెందిన వారే సుమారు 25 మంది వరకూ ఉంటారన్నది 2017లో చంద్రబాబు హయాంలో భూముల ఆక్రమణలపై వేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), 2019లో జగన్ హయాంలో వేసిన సిట్ పట్టిచూపుతున్నాయి. అయితే చర్యలు తీసుకోవడంలో ఇరు పార్టీలూ దొందూ దొందే.. 2024లో టిడిపి కూటమి రాష్ట్రంలో అధికారానికి రావడంతో ఇప్పుడైనా ఈ తీగ లాగుతారా? అంటే వేచిచూడాల్సిందే.

వేల ఎకరాలపై వేసిన 2 సిట్ నివేదికలూ బుట్టదాఖలే...

గత చంద్రబాబు హయాంలో కూడా 2017లో ఐపిఎస్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేశారు. ప్రభుత్వ రికార్డులను పరిశీలించి పలు అక్రమాలను ఆ బృందం గుర్తించింది. మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమర యోధులు, రాజకీయ బాధితుల కోసం నగర పరిసరాల్లో కేటాయించిన భూములు చేతులు మారాయని తేల్చింది. 2018లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సుమారు 3000 వరకూ దరఖాస్తులు టిడిపి హయాంలో భూ కుంభకోణాలపై వచ్చినా చర్యల్లేవు.

వైసిపి హయాంలోనూ ఇదే తంతు...

వైసిపి హయాంలో 2019 అక్టోబర్, నవంబర్‌లో సిట్ విచారణ జరిపింది. మాజీ బ్యూరోక్రాట్‌లు విజయ్‌కుమార్, వైవి అనురాధ, మాజీ జిల్లా సెషన్స్ జడ్జి టి.భాస్కరరావు నేతృత్వంలో ఈ పరిశీలన చేసింది. 2020 ఫిబ్రవరిలో వైసిపి హయాంలో మొదటి మధ్యంతర నివేదిక అందింది. వీరి హయాంలో దాదాపు 2200 వరకూ భూ ఫిర్యాదులు వచ్చాయి. 2021లో ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో సెప్టెంబర్‌లో నివేదిక సమర్పించారు. రికార్డుల ట్యాంపరింగ్, ప్రభుత్వ భూములను ఆక్రమించడం, ప్రభుత్వ భూమిని లాక్కోవడం, ప్రభుత్వ భూమిని ప్రయివేటు వ్యక్తులకు, సంస్థలకు కేటాయించడం, రాజకీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఎన్‌ఒసిలు జారీచేయడం వంటి 6 రకాలుగా భూములను వర్గీకరించారు. వైసిపి హయాంలో సిట్‌కు 1400 దరఖాస్తులు వచ్చాయని కొన్నిటినీ దాచేసి చెప్పడం జరిగింది. వీటిలో ఎక్కువ భాగం 22-ఎ భూములకు సంబంధించినవి. పరిశీలన చేసిన అనంతరం సుమారు 400 క్లియర్ చేశారు. మిగతావన్నీ రెవెన్యూ తగాదాల్లోనే మూలుగుతున్నాయి. ఆ తర్వాత కోవిడ్ రావడంతో 2020 జూన్ తర్వాత సిట్ కార్యకలాపాలు ఆగిపోయాయి. 2021 జనవరి నెలాఖరున మధ్యంతర నివేదిక ఇచ్చింది. ల్యాండ్ స్కాం విశాఖ గ్రామీణ ప్రాంతం భీమిలి, అనకాపల్లి, పరవాడ, అచ్యుతాపురం, సబ్బవరం సహా మరికొన్ని మండలాల్లో వివిధ రకాల ప్రభుత్వ భూములకు సంబంధించి దాదాపు 3వేల ఎకరాల భూములు ఆక్రమణకు గురైనట్లు పేర్కొన్నారు. 300 మంది వ్యక్తుల చేతుల్లో ఇవి ఉన్నట్లు తేల్చారు. దీనిపైనా వైసిపి హయాంలో చర్యల్లేవు.

నేరాలు ఘోరాలు

లారీ, కారు ఢీ : పలువురికి గాయాలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోనీ టైడా ఘట్ రోడ్డులో లారీ, కారు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారు బోల్తా పడింది. ఆదివారం టైడా మూడవ మలుపు సమీప మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రర్యాటక ప్రాంతాలు తిలకించిన అనంతరం అరకు నుండి విశాఖ కు వెలుతున్న కారు విశాఖ నుండి అరకు వస్తున్న లారీ ఎదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కారు బోల్తా పడింది. కారులో పర్యాటకులకు గాయాలు తగినట్లు సమాచారం పూర్తి వివరాలు తెలియవలసి ఉంది



బోల్తా పడిన వాహనాలు

సూక్ష్మసేద్యంపై ప్రభుత్వం దృష్టి

- పంట దిగుబడి, ఖర్చు తగ్గించడమే లక్ష్యం
- జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జివి లక్ష్మి





ప్రజాశక్తి-అనకాపల్లి

భూగర్భ జలాలు నానాటికి అడుగంటుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ సేద్యంపై దృష్టి సారించిందని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జివి లక్ష్మి తెలిపారు. నాణ్యమైన పంట దిగుబడి, ఖర్చు తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. సూక్ష్మ సేద్యం విధానంపై ఆమెను కలిసిన 'ప్రజాశక్తి'తో పంచుకున్న వివరాలు ఆమె మాటల్లోనే...

సూక్ష్మ సేద్యం ప్రాధాన్యతను వివరించండి.....

రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ సేద్యంపై దృష్టి సారించడం ద్వారా నాణ్యమైన పంట దిగుబడి, సాగు ఖర్చు తగ్గించడమే లక్ష్యం. నీరు, కరెంటు, ఎరువులు, కూలీల ఖర్చు ఆదా అవుతుంది.

ఎంత విస్తీర్ణంలో చేపడుతున్నారు?

రాష్ట్రంలో మూడు లక్షల హెక్టార్లలో, మన అనకాపల్లి జిల్లాలో 2024- 25 సంవత్సరానికి 3600 హెక్టార్లలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సూక్ష్మ సేద్యం అమలు చేసేందుకు విద్యుత్తు, నీరు తప్పనిసరిగా ఉండాలి.

ఇందుకోసం ఎంత ఖర్చు చేస్తున్నారు?

కేంద్ర ప్రభుత్వం పిఎంకెఎస్‌వై పథకం కింద రూ.9.72 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం ఎపిఎంఐపి పథకం కింద రూ.6.48 కోట్లు వెరసి 60: 40 నిష్పత్తిలో మొత్తం రూ.17.45 కోట్లు వ్యవసాయ, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఖర్చు చేస్తున్నారు.

ఎటువంటి రైతులను లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారు?

బిందు సేద్యంలో ఐదు ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులకు 90 శాతం రాయితీ, ఐదు ఎకరాల నుంచి 12.50 ఎకరాల వరకు ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై ఎంపిక చేయడం జరుగుతుంది. తుంపర సేద్యంలో ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులకు 55 శాతం, ఐదు ఎకరాల పైబడ్డ రైతులకు 45 శాతం రాయితీ అందిస్తాం.

ఈ పథకం కింద దరఖాస్తు ఎలా చేయాలి?

సూక్ష్మ సేద్యం రాయితీ నిమిత్తం రైతు రిజిస్ట్రేషన్ సేవా కేంద్రంలో విఎఎ, విహెచ్ఎ, ఎంఐఎఒ లేదా ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలి. భూమి హక్కు పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఎఫ్ఎంబి భూమి సరిహద్దులు, నీటి వనరులు (బోర్ వెల్/ బావి/ కాలువ) వివరాలతో ఆన్‌లైన్లఓ దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత ప్రాధాన్యత క్రమంలో అనుమతులు ఇస్తాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సరోజిని, సిపిఎం నేతలు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టిన 104 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం స్థానిక సర్పంచ్ పూనం సరోజిని, సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా ఏ అభివృద్ధి జరగలేదని, దీంతో రోడ్లన్నీ గోతులతో దారుణంగా ఉన్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సిసి రోడ్డు మంజూరు చేయించినట్లు చెప్పారు. నాణ్యత ప్రమాణాలతో సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల నాయకులు పంకు సత్తిబాబు, సిరప్ తాతబాబు రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గెడ్డలనుదాటి వైద్యసేవలు అందించేందుకు వెళుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-సీలేరు : ఈ సీజన్‌లో వచ్చే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఈశ్వర సందీప్ సూచించారు. జీకే వీధి మండలం ఏ.దారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామానికి ఆదివారం ఉదయం వైద్య సిబ్బంది వాగు దాటుతూ చేరుకున్నారు. అనంతరం అక్కడ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఒక రోగికి జ్వరం తీవ్రత ఎక్కువగా ఉండడంతో సప్పర్ల పిహెచ్‌సికి మెరుగైన వైద్యం నిమిత్తం తరలించారు. అనంతరం వైద్యాధికారి ఈశ్వర సందీప్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దోమతెరలు వినియోగించాలని, ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజవొమ్మంగిలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సోమవారం రాజవొమ్మంగి మండలంలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమంల్లో పాల్గొంటారు. గత నెల 27న జరిగిన రాజవొమ్మంగి మండల రివ్యూ మీటింగ్‌లో రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రుల్లో విద్యుత్ సరఫరా సరిగా లేక ఇబ్బంది పడుతున్నారని తెలియజేయడంతో స్పందించిన ఎమ్మెల్యే తన మొదటి నెల వేతనంతో ఆ ఆసుపత్రులకు ఇన్వెర్టర్లు కొనుగోలు చేసి సోమవారం అందించనున్నారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు వాటర్ ట్యాంక్ శంకుస్థాపన చేయడానికి అమీనాబాద్ కాలనీకి వెళ్ళనున్నారు.

కొట్టుకుపోయిన కల్వర్టు పరిశీలన

ప్రజాశక్తి- విఆర్.పురం : మండలంలోని ములకనపల్లి పంచాయతీ మడివిగుంపు, సిరియా గుంపు మధ్య గల పీసం వాగుపై ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీనిని ఆదివారం స్థానిక సర్పంచ్ సవలం మారయ్య, సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మారయ్య మాట్లాడుతూ మడివి గుంపు, సరియా గుంపు మధ్యగల పీసం వంతెన పూర్తిగా కొట్టుకుపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు.

గతంలో ఈ వాగు పొంగినప్పుడు కొంతమంది కొట్టుకుపోయి సంఘటనలు ఉన్నాయన్నారు. ఇప్పుడు కల్వర్టు పూర్తిగా కొట్టక పోయిందని, పాఠశాలకు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ వాగుపై కల్వర్టు నిర్మాణం చేయాలని కోరారు.

అలాగే కొత్తపేట, గొల్లగూడెం, నాగేంద్ర పురం, ములకనపల్లి, జల్లివారి గూడెం, కుంజ వారి గూడెం తదితర గ్రామాల్లో రహదారులు పూర్తిగా గోతులు పడి పోయాయని, గతంలో ఎన్నో సార్లు ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్లామని, కాని నేటికీ రహదారుల నిర్మాణం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే కొత్త రహదారులు వేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మోసం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు పరిశీలిస్తున్న సర్పంచ్, సిపిఎం నేతలు

ఆదమరిస్తే ప్రమాదం తప్పదు



రోడ్డు మధ్యలో ఏర్పడిన రంధ్రం

ప్రజాశక్తి-మోతుగూడెం : చింతూరు మండలం గుడ్లగూడం, గోపాలపురం గ్రామాల మధ్యలో ఉన్న రహదారి మధ్యలో గొయ్య పడింది. 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు ఇరువైపులా, కల్వర్టులు దెబ్బతిన్నాయి. గోపాలపురం గ్రామం వద్ద కల్వర్టు మధ్యలో గొయ్యపడి, ఇరువైపులా మట్టి కొట్టుకుపోవడంతో ప్రమాద స్థాయిలో ఉన్నది. భారీ వాహనాలు వెళ్తే అది ఇంకా క్రుంగిపోయే అవకాశం ఉంది. గ్రామస్తులు వాహనదారులు ఈ గోతిలో పడిపోకుండా గొయ్య చుట్టూ ఎదురు బొంగులు ఉంచి ప్రమాద హెచ్చరిక అని తెలుపుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు భారీ స్థాయిలో పెరగడంతో మలుపుల వద్ద రోడ్డు కనిపించక ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు మధ్యలో ఉన్న గోయ్యిను పూడ్చాలని, రోడ్డుకి ఇరు పక్కలా పెరిగిన తుప్పలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను పాడుచేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని కొయ్యూరు సిఐ పివి.వెంకటరమణ అన్నారు. ఆపరేషన్ పరివర్తనలో భాగంగా ఆదివారం కొయ్యూరు వారపు సంతలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గంజాయి పంటలు పండించడం, రవాణా చేయడం నేరమని, దాని జోలికి వెళ్లొద్దన్నారు. గంజాయి పంటకు బదులు ప్రత్యమ్నాయి పంటల వైపు మొగ్గుచూపి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మంప ఎస్సై లోకేష్ కుమార్, పోలీసులు పాల్గొన్నారు.



పోలీసుల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

నైట్ సర్వీసు బస్సులు పునరుద్ధరణ

ప్రజాశక్తి -సీలేరు : భారీ వర్షాలు కారణంగా 20 రోజులుగా నిలిచిపోయిన విశాఖ నుండి సీలేరు, భద్రాచలం నైట్ సర్వీసు బస్సులను ఎట్టకేలకు ఆదివారం రాత్రి నుండి ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. భారీ వర్షాల వల్ల మన్యంలోని చింతపల్లి, జికె.వీధి, సీలేరు ప్రధాన రహదారిలో చెట్లు కూలిపోతుండడంతో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు నైట్ సర్వీసు బస్సులను రద్దు చేసిన విషయం విధితమే. గత నెల 28 నుంచి ఈ నెల 3 వరకు మావోయిస్టు వారోత్సవాలు జగిరిన నేపథ్యంలో పోలీసులు ఆదేశాలు మేరకు ఆర్టీసీ అధికారులు నైట్ సర్వీసులు రద్దును పొడిగించారు. మావోయిస్టుల వారోత్సవాలు ముగియడంతో ఆదివారం రాత్రి నుంచి పూర్తిస్థాయిలో నైట్ సర్వీసు బస్సుల్ని తిప్పేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



గిరిజనులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-కూనవరం : ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు డిఎంహెచ్ఒ ఆధ్వర్యాన మండలంలోని కారుమానుకొండ, పాత కారుమానుకొండ, గబ్బిలాలగొంది, చింతగండి గ్రామాలలో ఆదివారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అలాగే ఇంటింటికి తిరిగి సర్వే చేసి, రక్తపూతలు సేకరించారు. సుమారు 135 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటూరు వైద్యాధికారి శ్రీనివాస్‌మూర్తి, ఎఎంఒ శ్రీనివాస్‌రాజు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన



పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కాలేజీలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- ఎటపాక : యువత కెరీర్‌పై దృష్టి పెట్టాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎటపాక సిఐ రామారావు, ఎస్ఐ పార్థసారథి అన్నారు. ఆదివారం స్థానిక పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కాలేజీలో మత్తు పదార్థాల వినియోగంపై కలిగే దుష్పరిణామాల గురించి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిఐ రామారావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు గంజాయి, నార్కోటిక్ డ్రగ్స్ బారినపడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి తమ జీవితాలను జైలుపాలు చేసుకోవద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ జకరయ్య , వైస్ ప్రిన్సిపాల్ హథి రామ్, కరస్పాండెంట్ రాజశేఖర్, కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

రామవరంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలంలోని రామవరం పంచాయతీ పరిధిలోని సోపల్లి, రామవరం పాడు, కారం గుంపు, పులి గుంపు, కొప్పపల్లి, శబరి రాయిగూడెం, సోముల గూడెం గ్రామాల్లో ఆదివారం సర్పంచ్ కారం బుచ్చమ్మ ఆధ్వర్యాన పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా బుచ్చమ్మ మాట్లాడుతూ వరదలకు ముంపునకు గురైన గ్రామాలకు బాధితులు తిగిరి గ్రామాలకు వచ్చారని, వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు శానిటేషన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. వ్యాధులు ప్రబల కుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కారం సత్యం, వడ్లాది రమేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది